

అదుపుతప్పిన బైక్

ఐదేళ్ల బాలుడి మృతి

తల్లిదండ్రులకు తీవ్రగాయాలు

ఆస్పత్రికి వెళ్తుండగా ప్రమాదం

వార్త..7లో

గణతంత్ర వేడుకల విజయవంతానికి

సన్నద్ధం కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లు

సమీక్షలో జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలను అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు సర్వసన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. ప్రతీ ప్రభుత్వ శాఖలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే విధంగా జిల్లాస్థాయి అధికారులు జాబితాలను సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై మంగళవారం జిల్లాస్థాయి అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన వేదిక వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియాకు సిట్టింగ్ ఏర్పాట్లు, ప్రోటోకాల్‌ను ఆర్డీవో చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పారిశుధ్య ఏర్పాట్లు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. డీఐపీఆర్వో, సీపీవోల సహకారంతో జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికలను సిద్ధంచేసి ముఖ్య అతిథులకు ప్రసంగ నివేదికలుగా తయారు చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, చేనేత జౌళిశాఖ, పంచాయతీరాజ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 సంచార వైద్యసేవలు, 108 అత్యవసర వైద్యసేవల విభాగాలకు సంబంధించి సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలను రూపొందించి పోటీల నిర్వహణకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవో కె.మాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంతృప్తికర స్థాయిలో ప్రజల అర్జీలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ మధుసూదన్

అమలాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య నమ్మకాన్ని పెంచేలా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అమలులో అర్జీదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేయాలని పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి, డీఎల్డీవో ఎస్.త్రినాథరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పీజీఆర్ఎస్ అమలుతీరు, సందేహాల నివృత్తికై జిల్లాస్థాయి కార్యశాలను ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ సంతృప్తికర స్థాయిలో సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల ఒక్కోసారి ఫిర్యాదులు పునరావృతం అవుతున్నాయన్నారు. ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా ప్రతీ దశలోను జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా పీజీఆర్ఎస్‌ను అమలు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమర్థవంతంగా జవాబుదారీతో ఏవిధంగా పనిచేయాలో వివరించారు. అర్జీదారుడు క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం పట్ల సంతృప్తి చెందిన తర్వాత ఎండార్స్‌మెంట్‌పై సంతకం తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు అర్జీదారునితో సంప్రదించి సంతృప్తి చెందిందీ లేనిదీ మరోసారి తనిఖీ చేసుకోవాలన్నారు. ప్రతీ సమస్యను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. మొక్కుబడి పరిష్కార మార్గాలు చూపడంతో ఈ పథక ఆశయం నెరవేరడం లేదన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, డీపీవో డి.శాంతలక్ష్మి, డ్వామా పీడీ మధుసూదన్, డీఎల్డీవో ప్రభాకర్, ఎస్టీసీ కృష్ణమూర్తి, డీఎల్పీవో పి.బొజ్జిరాజు, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తువ్వ మట్టి లారీ సీజ్

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన ● ర్యాంపుల్లో తనిఖీలు

పి.గన్నవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడి వద్ద అనుమతులు లేకుండా తువ్వ మట్టిని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన తువ్వమట్టినీ వదల్లేదు! వార్తకు స్పందించిన అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉడిమూడి నుంచి అనధికార ర్యాంపు నుంచి వస్తున్న తువ్వ మట్టి లారీని గంటిపెదపూడి ఏటిగట్టుపై స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఆర్ఐ వర్మ, వీఆర్వో దుర్గాప్రసాద్ ఉన్నారు.

దేవస్థానం భూముల్లో అనుమతులు లేని

కట్టడాలపై చర్యలు

దేవదాయ శాఖ అధికారులు

అంతర్వేది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన రాజోలు గ్రామంలో 203/2 సర్వే నంబరులో గల 32 స సెంట్ల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు దేవదాయశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అమలాపురం తనిఖీదారు యుద్ధ ప్రాతిపదికన మంగళవారం పర్యవేక్షించారు. అక్రమ కట్టడాలు జరుగుతున్న భూమి వద్దకు వెళ్లి అక్కడ ఉన్న ఫౌండేషన్ వేయడానికి ఏర్పాటు చేసిన ఐరన్ బుట్టలను, ఐరన్ కట్టుబడిని దగ్గరుండి భూమి సాగుచేసే రైతుచే తొలగించి భూమిని యథాస్థితికి తీసుకువచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. దేవస్థానం అనుమతి లేకుండా దేవస్థానం భూముల్లో ఏ ఇతర కట్టడాలు జరిగినా సెక్షన్ 83(2) ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగు గాడి తప్పుతోంది..



ఇంకా రబీ వరినాట్లా?

ఆలస్యమైన ఖరీఫ్ మాసూళ్లు

క్షీణిస్తున్న అపరాల సాగు అవకాశాలు

వ్యవసాయాధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు

వరి సేద్యంలో గిట్టుబాటు కరువవడం.. కూలీల కొరత.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం.. వంటి కారణాలతో రానురాను వరి సాగు గాడి తప్పుతోంది. సాధారణంగా ఖరీఫ్ సాగు జూన్‌లో ప్రారంభమై నవంబరుతో ముగుస్తుంది. రబీ సీజన్ నవంబరు నెలలో ప్రారంభమై మార్చి నెలాఖరుతో ముగుస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగు అందుకు భిన్నంగా సాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో రబీ సాగు జనవరి నెల 4వ వారం వస్తున్నా ఇంకా రైతులు వరినాట్లు వేస్తూనే ఉన్నారు.





నాట్లు వేస్తున్న కూలీలు

ముమ్మిడివరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గతంలో అయితే జనవరి నెలాఖరు నాటికి వరి పిలకలు తొడిగే దశ ముగిసి అంకురం ఏర్పడే దశలో ఉండేది. ఈ ఏడాది నెలా 15 రోజులు వరిసాగు ఆలస్యమైంది. జిల్లాలో 1,88,150 ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 1,15,396 ఎకరాల్లో వరినాట్లు పూర్తి అయ్యాయి అంటే 61 శాతం మేర వరి నాట్లు పూర్తి అయ్యాయి. కూలీల కొరత వెంటాడడంతో రైతులు ఎక్కువగా ప్రస్తుత సీజన్‌లో విత్తనం వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టారు. కొంత మంది రైతులు ఏలూరు నుంచి, బెంగాళీ కూలీలతో వరినాట్లు వేస్తున్నారు. ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.4200 వరకు తీసుకుంటున్నారు. దీంతో వరినాట్లు వేయడంలో కొంత జాప్యం జరుగుతోంది. నవంబరు, డిసెంబరు నెలల్లో ఖరీఫ్ కోత చేతికి వచ్చే సమయంలో అల్పపీడనాలు, తుపానుల వంటి కారణాల వల్ల డిసెంబరు నెలాఖరు వరకు అడపాదడపా వర్షాలు కురవడంతో ఖరీఫ్ మాసూళ్ల ఆలస్యమయ్యాయి. దీంతో నారుమడులు కూడా ఆలస్యంగా వేశారు. ఇప్పటికీ రైతులు నాట్లు వేస్తూనే ఉన్నారు. రబీ పంటకాలం 120 నుంచి నుంచి 130 రోజులు ఉంటుంది. అంటే నాలుగు నెలలు పంటకాలం. జనవరి నెలాఖరు వరకు నాట్లు వేస్తే ఏప్రిల్ నెలాఖరుకు గానీ, మే నెల మొదటివారంలో గానీ పంట చేతికి వస్తుంది. దీనివల్ల మూడో పంటగా అపరాల సాగుకు అవకాశం ఉండదు. దీనివల్ల రైతులు అపరాల పంటను కోల్పోవాల్సి వస్తుంది. సకాలంలో రైతులు సాగు చేపట్టడంలో వ్యవసాయాధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. ముందస్తు సాగుకు ప్రణాళికలు రూపొందించి సాగుకు సమాయత్తం వంటి సదస్సులు నిర్వహిస్తున్నా రైతుల్లో మాత్రం చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. దీంతో వరిసాగు వెనుకబడిపోతుంది.

ఉత్తరవాహినిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఉత్తరవాహిని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

ముమ్మిడివరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గేదెల్లంక ఉత్తరవాహిని ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత విశిష్టతను దేశ ప్రజలందరికీ తెలియచేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. ముమ్మిడివరం మండలంలోని గేదెల్లంక ఉత్తరవాహిని ప్రాంతాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు కూటమి నాయకులతో కలిసి సోమవారం సందర్శించారు. గోదావరి నదీ మూడు పాయలు గేదెల్లంక ఉత్తరవాహిని వద్ద కలిసి ఉత్తరం వైపునకు ప్రయాణించడంతో ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. సుందరమైన, ఆధ్యాత్మిక ప్రాంతంగా విరాజిల్లుతుందన్నారు. ప్రకృతి రమణీయతను, విశిష్టతను దేశ ప్రజలకు తెలియచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇక్కడ స్నానాలు ఆచరిస్తే ఎంతో పుణ్యం కలుగుతుందనే నానుడి ఉందని చెప్పారు. సమీపంలో ఐ.పోలవరం వీరేశ్వరస్వామి ఆలయం, కాట్రేనికోన మండలంలోని కుండలేశ్వరస్వామి, అప్పనపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. పిలిగ్రిమ్ టూరిజం, ఏకో టూరిజంతో పాటు వాటర్ స్పోర్ట్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వీటికి సంబంధించి సమగ్రమైన నివేదికను టూరిజం శాఖకు అందిస్తే సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో టూరిజం కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో రిసార్ట్స్‌ను కూడా ఏర్పాటుచేస్తే సందర్శకులు రెండు, మూడు రోజులు బస చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ సౌకర్యాలను కల్పిస్తే కేరళను మించి టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కేరళను మించిన ప్రకృతి సౌందర్యం కోనసీమలో ఉందన్నారు. ఇప్పటి వరకు మనం దానిని ఒడిసి పట్టుకోలేకపోయామన్నారు. గత ప్రభుత్వం టూరిజాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా గేదెల్లంక ఉత్తరవాహినిని కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇక్కడి విశిష్టత, సుందరమైన ప్రాంతాన్ని దేశ ప్రజలందరికీ చూపించగలుగుతామన్నారు. మంత్రి వెంట నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్ధాని శ్రీనివాసరావు, గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, గుద్దటి జమి, ముత్యాల జయలక్ష్మి, గోదశి పుండరీష్, మోకా బాలప్రసాద్, దూడల స్వామినాయుడు, గుద్దటి నాగరాజు, గుద్దటి విజయ్, అత్తిలి బాబూరావు, గుద్దటి సుబ్బారావుతో పాటు పలువురు ఉన్నారు.

యానాంపై 'పొన్నాడ' గురి

మల్లాడిపై రాజకీయ ఆధిపత్యానికి రెడీ?

కాంగ్రెస్ నేతలతో భేటీ తర్వాత అదే చర్చ





యానాం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ పుదుచ్చేరి కాంగ్రెస్ రాష్ట్ర నేతలను కలిసిన వ్యవహారం యానాం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కలయికతో రకరకాల ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పొన్నాడ సతీష్ తన రాజకీయ గురువు అయిన మల్లాడి కృష్ణారావుపై పోటీ చేస్తారనే చర్చ విస్తృతంగా సాగుతోంది. రాజకీయ గురువు మల్లాడి కృష్ణారావు ఆశీస్సులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముమ్మిడివరం నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన పొన్నాడ 2009లో విజయం సాధించారు. అయితే కొన్నాళ్ల పాటు ఎంతో సన్నిహితంగా మెలిగిన గురుశిష్యుల మధ్య తర్వాత రాత పొరపొచ్చాలు వచ్చాయి. యానాంలో 2021లో జరిగిన ఎన్నికల్లో తాను యానాం ఎమ్మెల్యే అభ్యర్థిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి అభ్యర్థిని పోటీలో ఉంచితే తెరవెనుక ఉండి సతీష్ వెన్నుపోటు పొడిచారని మల్లాడే అనేక సార్లు సమావేశాల్లో ప్రస్తవించారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో సతీష్‌కు వ్యతిరేకంగా మల్లాడి పనిచేశారనే చర్చ అప్పట్లో నడిచింది. ఆ ఎన్నికల్లో అది పొన్నాడకు తీవ్ర నష్టం చేయడంతో మల్లాడి, పొన్నాడ మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో పొన్నాడ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో టచ్‌లోకి వెళ్లడం యానాం నియోజకవర్గంలో తీవ్ర చర్చకు దారి తీసింది. యానాం నియోజకవర్గంలో మల్లాడికి వ్యతిరేకంగా రాజకీయంగా పనిచేసేందుకే పొన్నాడ కాంగ్రెస్ నేతలను కలిశారని, ఇక ఆయన పార్టీ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమే అని చర్చించుకుంటున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'అడబాల'

సీనియర్ నేతకు అవకాశం

అధిష్ఠానం ప్రకటన



అమలాపురం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా అడబాల సత్యనారాయణ ఎన్నికయ్యారు. మలికిపురం మండలం తూర్పు పాలెం గ్రామానికి చెందిన ఆయన 1994లో బీజేపీలో చేరారు. రాష్ట్ర జిల్లా స్థాయిలో అనేక పదవులు నిర్వర్తించారు. అమలాపురం అసెంబ్లీ కన్వీనర్‌గా రెండు సార్లు పనిచేశారు. రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో వింత పరిస్థితి

బీజేపీ జిల్లా శాఖ అధ్యక్ష ఎన్నిక ఓటింగ్‌లో విజయం సాధించిన అభ్యర్థిని కాదని, పార్టీ నిర్ణయం మేరకు ఓడిపోయిన అభ్యర్థిని జిల్లా అధ్యక్షునిగా ప్రకటించిన తీరుపై పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ జిల్లా శాఖ కార్యాలయంలో మంగళవారం ఏపీ ఎన్నికల అధికారి పాక సత్యనారాయణ, జిల్లా ఎన్నికల అధికారి పెద్దిరెడ్డి రవికిరణ్, పరిశీలకుడు ఏపీఆర్ చౌదరి ఆధ్వర్యంలో జిల్లాశాఖ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి ఇప్పటి వరకు పనిచేసిన యాళ్ల వెంకటరామ్మోహనరావు (దొరబాబు)తో పాటు అడబాల సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికలు నిర్వహించగా సత్యనారాయణకు నామమాత్రంగానే మద్దతు లభించగా మిగిలిన మండలశాఖల ప్రతినిధులంతా దొరబాబుకు ఓటేశారు. అయితే రాష్ట్ర పార్టీ అధిష్ఠానం మేరకు ఎన్నికల్లో గెలిచిన దొరబాబును కాదని సత్యనారాయణను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికల అధికారి సత్యనారాయణ ప్రకటించంతో పార్టీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేశాయి. ఇలా అయితే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని పలువురు ప్రశ్నించారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ప్రకటించి ఎన్నికల అధికారులు వెళ్లిపోయారు.



'అడబాల'ను అభినందిస్తున్న నాయకులు

విద్యార్థి దశ నుంచే భద్రతా నియమాలను పాటించాలి

జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీవో తదితరులు

అమలాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చునని జిల్లా రవాణాధికారి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అమలాపురంలో మంగళవారం కళాశాలల విద్యార్థులకు భద్రతా నియమావళిపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. వాహనం నడిపే ప్రతీ వ్యక్తి హెల్మెట్ విధిగా ధరించాలని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ సాధించిన వ్యక్తి గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడితో సమానమని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ప్రమాదాల సమయంలో ప్రాణాపాయ స్థితికి చేరుకోవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని మెటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ విద్యార్థులచే ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అమలాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై కాశీవిశ్వేశ్వరరావు అవగాహన కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా 126 ప్రైవేటు బస్సులపై కేసులు: డీటీవో శ్రీనివాస్

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 126 బస్సులపై కేసులు నమోదు చేసినట్టు జిల్లా రవాణాధికారి శ్రీనివాస్ తెలిపారు. మోటారు వాహనాల చట్టం కింద రూ8.09 లక్షలు అపరాధ రుసుముగా వసూలు చేసినట్టు తెలిపారు. వీటిలో 55 కేసులు అధిక చార్జీలు వసూలు చేసినందుకు, ఇతర క్రమశిక్షణా రాహిత్యాల కింద 77 కేసులు నమోదు చేశామన్నారు. ప్రత్యేక తనిఖీల్లో మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, కాశీవిశ్వేశ్వరరావు, సురేష్‌కుమార్, లక్ష్మీశ్రీదేవి, షణ్ముఖశ్రీనివాస్, కౌశిక్ పాల్గొన్నారు.

కుమార్తెను వేధిస్తున్నాడని ఓ బాలుడిపై బ్లేడ్‌తో తండ్రి దాడి

7లో





కలసి రాని 'సీజన్'

- సీజనల్ చామంతులకు గడ్డుకాలం
- పండుగలొచ్చినా అమ్మకాలు డల్

కడియం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల్లో సందడి చేసే సీజనల్ పుష్పాలు ఈ ఏడాది అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పండుగలు వచ్చి వెళ్లిపోయినా, కొనుగోలుదారులు రాక ఈ రంగురంగుల సీజనల్ మొక్కలు అన్ని నర్సరీల్లోనే ఉండిపోయాయి. ఈ పండుగల్లో అలంకరణకు ఈ మొక్కలను అధికంగా వినియోగిస్తారు. అందుకే ప్రతీ ఏటా పెద్దఎత్తున నర్సరీ రైతులు ఈ మొక్కలను ఉత్పత్తి చేసి అమ్మకాలకు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు లేకపోవడం వల్ల మొక్కలు పూర్తిస్థాయిలో వికసించాయి. కానీ అమ్మకాలు లేకపోవడంతో నర్సరీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మంచు కురిసే శీతాకాల సమయంలో మాత్రమే ఈ సీజనల్ పుష్పాలు వికసించి ఫిబ్రవరి మాసం ఎండ చుర్రుమనగానే వాడిపోతాయి. అందుకనే వీటిని సంక్రాంతి నాటికి అమ్మకాలు పూర్తిచేస్తారు. అయితే అమ్మకాలు లేకపోవడంతో నర్సరీల్లో ఈ మొక్కలు ఉండిపోయాయి. సందర్శకులను అలరిస్తున్నా.. ఈ మొక్కలు రైతులకు మాత్రం విక్రయాలు సాగడం లేదు. కడియం మండలం వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ నర్సరీల నుంచి కొనుగోలుదారులు ప్రతిఏటా పెద్దఎత్తున సీజనల్ మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ఈ ఏడాది అమ్మకాలు అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు ధరలు కూడా తగ్గించారు. సైజును బట్టి మొక్క ఒక్కింటికి రూ.100 నుంచి 150కు విక్రయించే ఈ మొక్కలను 50 నుంచి 100 వరకు అమ్మకాలు చేస్తున్నారు.

నల్ల మిర్చి.. బ్లాక్ చిల్లీ..

కడియం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంక గ్రామంలో పేపరు ఏజెంట్ మలసాని గోవిందరాజులు ఇంటి ఆవరణలో బ్లాక్‌చిల్లీ అందర్నీ అబ్బురపరుస్తోంది. ప్రకాశం జిల్లాకు చెందిన తన స్నేహితుడు తనకు ఈ మొక్కను ఇచ్చాడని, ఇంటి ఆవరణలో ఉన్న మొక్కలతోపాటు వీటిని కుండీల్లో వేసి పెంచుతున్నానని, చెట్టుకు 35 నుంచి 40 కాయలు కాస్తోందని గోవిందరాజులు తెలిపారు. ఈ కాయలు కూరకు కోయడం లేదని, అందంగా ఉండడంతో కుండీల్లో పెంచుతున్నానని తెలిపారు.





కాకినాడ రామారావుపేటలోని అన్నా క్యాంటీన్.. క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న దృశ్యం

ఎలా ఉందో చెప్పండి.. క్యూఆర్ కోడ్‌లో..

- అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజాభిప్రాయ సేకరణ
- నిర్వాహకులపై పలు ఫిర్యాదులు అందుతున్నట్టు సమాచారం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, క్యాంటీన్ల నిర్వహణ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాలను సేకరిస్తోంది. ఇందుకోసం ఆయా క్యాంటీన్ల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి భోజనం చేయడానికి వచ్చే వారి అభిప్రాయాలను కోరుతోంది. పట్టణ ప్రాంతాల్లో నిరుపేద కార్మికులు, దినసరి కూలీల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ పూటకి ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు. భోజన సరఫరా బాధ్యతను స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. అయితే అల్పాహారం, భోజనం నాణ్యతపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించింది. డిజిటల్ లావాదేవీల తరహాలో క్యూఆర్ కోడ్‌ను అమలుల్లోకి తెచ్చింది. కాకినాడ జిల్లాలో మొత్తం 25 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. కాకినాడలో వివేకానంద పార్కు, సంతచెరువు, డెయిరీఫారం సెంటర్, జగన్నాథపురం, సర్పవరం, రమణయ్యపేట మార్కెట్ అన్నక్యాంటీన్ల వద్ద లోపల, బయట గోడలపై క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటుచేశారు. భోజనం చేయడానికి వచ్చినవారు తమ చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఈక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఈ క్యాంటీన్‌ను సకాలంలో తెరుస్తున్నారా, ఆహార పదార్థాలు నాణ్యతగా ఉంటున్నాయా, పరిశుభ్రతను పాటిస్తున్నారా అని మూడు ప్రశ్నలు వస్తాయి. అవును, లేదు అని ఆప్షన్ ఉన్నచోట ఏదో ఒకదానిపై క్లిక్ చేస్తే సరిపోతుంది. అయితే ఎక్కువ శాతం అన్నక్యాంటీన్‌కి వచ్చే వారికి పెద్దగా ఆండ్రాయిడ్ మొబైల్స్ లేకపోవడంతో అన్నక్యాంటీన్‌కి వస్తున్న కొద్దిమంది విద్యార్థులు మాత్రమే ఈ క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని ఉపయోగించుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఆహార పదార్థాల వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకపోయినా నిర్వాహకుల తీరుపై ఫిర్యాదులు అందుతున్నట్టు తెలుస్తోంది. కాకినాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ క్యాంటీన్లలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఏర్పాటుచేసిందని చెప్పారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న దృశ్యం





విద్యార్థిని సంపర్తి పూజితను అభినందిస్తున్న స్కూల్ కమిటీ సభ్యులు

అండర్ 19 నేషనల్ మీట్‌కి ఎంపికైన సీజీటీఎం విద్యార్థిని పూజిత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సీజీటీఎం ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సంపర్తి పూజిత జాతీయస్థాయి అండర్-19 స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం స్కూల్ ప్రాంగణంలో పూజితను సీజీటీఎం పాఠశాల అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి అభినందించి ప్రోత్సాహక పారితోషికం అం దించారు. పూజిత అండర్-15 క్రికెట్ నుంచి అండర్-19 వరకు అనేక పతకాలను సాధించింది. ఇప్పుడు జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ చింతల కృష్ణాజీ, జాయింట్ సెక్రటరీ నేమాని రాజశేఖర్, కోశాధికారి నందివాడ చంద్రశేఖర్, సీహెచ్ నారాయణ, సూపరింటెండెంట్ ఎం. వెంకట్రాజు, ప్రధానోపాధ్యాయురాలు లిడియాగ్రేస్ అభినందించారు.

ఆధ్యాత్మికతత్వంతో మానసిక ప్రశాంతత

మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ

పిఠాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతత్వంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. పిఠాపురం పట్టణంలోని అనఘా దత్తక్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం జరిగిన పూజల్లో స్వామితోపాటు ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి పాల్గొన్నారు. ఉదయం కలశ పూజ, వేద పారాయణ, గోపూజ, శ్రీ చక్రార్చన, రుద్రయాగం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి మన్యుసూక్త హోమం, సాయంత్రం ప్రదోషకాల పూజ, శ్రీదత్త డోలోత్సవం నిర్వహించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహించిన పాదగయ రాగ సాగర కచేరీ భక్తతన్మయత్వంలో ముంచెత్తింది. రాత్రి భక్తులనుద్దేశించి స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తూ నిత్య జీవితంలో ఆధ్మాత్మికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి... పిఠాపురం అనఘా దత్తక్షేత్రంలో భక్తులతో మాట్లాడుతున్న మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ





రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ శంకరరావు, డాక్టర్ రియాజ్

మన్యంలో 'ముస్కాన్' బృందం పర్యటన

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సందర్శన... బాలలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా

రంపచోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో బాలల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న 'ముస్కాన్' బృందం మంగళవారం ప ర్యటించింది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చంటి పిల్లలు, బాలల ఆరోగ్య సేవల విభాగాన్ని బృందం ప్రతినిధులు డాక్టర్ గోపాల్ శంకరరావు, డాక్టర్ రియాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

పరిశీలించారు. పుట్టిన శిశువుల నుంచి 12 ఏళ్ల వరకు దేశవ్యాప్తంగా ఉన్న బాలల ఆరోగ్యం, వైద్య సేవల కోసం కేంద్రం ముస్కాన్ ద్వారా మెరుగైన వైద్య, ఆరోగ్య వనరులను కల్పిస్తోంది. ఆయా ఆసుపత్రుల స్థాయిని బట్టి ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అందాల్సిన సేవలు, ఉండాల్సిన వైద్యులు, వనరులను ఇప్పటికే నిర్దేశించారు. ఆ మేరకు ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సేవలు కచ్చితంగా అందుతున్నాయో లేదో అన్న అంశాన్ని ఈ బృందం పరిశీలిస్తోంది. గుర్తించిన సానుకూల, ప్రతికూల అంశాల మేరకు తదనంతర సదుపాయాలు, చర్యలు కేంద్రం నుంచే అందుతాయి. ముఖ్యంగా శిశు మరణాలను తగ్గించడం, ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడడం, అన్ని అత్యవసర సేవలను బాలల కోసం సిద్ధంగా ఉంచడం వంటి కీలక అంశాలను ఈ బృందం గమనిస్తోంది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో అందుతున్న శిశు ఆరోగ్య సేవలు, అందుబాటులో ఉన్న విభాగాలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, వనరులపై బృందం ప్రతినిధులు ఆరా తీశారు. రంపచోడవరం మన్యంలో ఉన్న పరిస్థితులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వివరించారు. తొలుత ప్రతినిధులను ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యాధికారులు, ఆసుపత్రి వైద్యాధికారులు, ఆసుపత్రి కమిటీ సభ్యుడు చోటు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కబడ్డీ పోటీలో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు



శాంతి ఆశ్రమంలో మాట్లాడుతున్న మాతా జ్ఞానేశ్వరీ దేవి, ప్రణవ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మనాభానంద సరస్వతి

ఓంకార స్వామి బోధనలు ఆచరణదాయకం

రుషికేష్ పీఠాధిపతి పద్మనాభానంద సరస్వతి

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం తోటపల్లిలోని శాంతి ఆశ్రమంలో వ్యవస్థాపకుడు ఓంకార స్వామి 131వ జయంతి వేడుకలు మంగళవారం నిరాడంబరంగా జరిగాయి. ప్రణవ పతాకాన్ని హిమాలయాలకు చెందిన రుషికేష్ పీఠాధిపతి పద్మనాభానంద సరస్వతి ఆవిష్కరించారు. ఓంకార మందిరంలో శాంతి ఆశ్రమ పీఠాధిపతి మాతా జ్ఞానేశ్వరీదేవి జ్యోతిప్రజ్వలన చేసి ఓంకార స్వామికి పూజలు నిర్వహించారు. జ్ఞాన మందిరంలో జరిగిన సమావేశంలో పద్మనాభానంద సరస్వతి మాట్లాడుతూ ఓంకార స్వామి ప్రపంచ శాంతికి కృషి చేశారని, ఆయన బోధనలు సర్వమానవాళికి ఆచరణదాయకమని చెప్పారు. 150 ఎకరాల విస్తీర్ణంలో శాంతి ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి సర్వమత ప్రార్థనలకు కట్టడాలు నిర్మించారన్నారు. ప్రణవానంద మాతాజీ, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో భజనలకు అవకాశం కల్పించండి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుని కలిసిన భజన కళాకారులు

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో భజనల ఏర్పాటుకు దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడతానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన జిల్లా భజన మండలి అధ్యక్షుడు సానా నూకరాజునాయుడు, చిత్రాడ ఆశ్రమానికి చెందిన విశ్వానంద భారతీస్వామి ఆధ్వర్యంలో భజన బృందాలు తుని మండలం తేటగుంటలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం యనమలను కలిశారు. ఇప్పటికే టీటీడీ దేవస్థానం పాలకమండలి అనుమతితో కళాకారులు నిత్యం భజనలు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుమలలో మాదిరిగానే అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భజనలు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని యనమల చెప్పారు. కార్యక్రమంలో భజన కళాకారులు పైలా అప్పలనాయుడు, సూర్యనారాయణ, అద్దేపల్లి రాజా, సిద్దా పెద్దిరాజు, గంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తేటగుంటలో యనమలను కలిసిన విశ్వానంద భారతీస్వామి, నూకరాజునాయుడు, కళాకారులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో సంక్రాంతి సంబరాలు ముగింపులో భాగంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. 36 బృందాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. తొలిరోజైన సోమవారం 14 జట్లు తలపడగా 7 జట్లు విజేతలుగా నిలిచాయి. రెండో రోజైన మంగళవారం మరో 7 జట్లు తలపడ్డాయి. ఎంఎంఆర్ ట్రస్టు అధినేత మురళీరాజు, పెద్దలు ముదునూరి సీతారామరాజు, జువ్వల బాబులు, నానిపల్లి చంటి, ఉప సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, చేకూరి రాంబాబు, దెందుకూరి హరి తిలకించారు.



వేటూరి సాహితీ పురస్కారానికి

సుద్దాల అశోక్‌తేజ ఎంపిక

29న తునిలో ప్రదానం

తుని రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పాటల రచయిత, తెలుగు సాహిత్యకారుడు, రెండువేలకు పైగా సినిమాల్లో మూడువేలపైచిలుకు పాటలు రాసిన సుద్దాల అశోక్ తేజకు వేటూరి చతుర్దశ (14వ) సాహితీ పురస్కారం అందజేయనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29న వేటూరి జయంతి సందర్భంగా తుని చిట్టూరి మెట్రోలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరవుతారన్నారు. వేటూరి సాహితీ పీఠానికి శాశ్వత గౌరవాధ్యక్షుడిగా ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా చక్కా సూర్యనారాయణ, అధ్యక్షుడిగా సీహెచ్ వీకే నరసింహారావు వ్యవహరిస్తున్నారు.

కూనవరంలో రేపు 'పోలవరం' గ్రామ సభ

కూనవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూనవరంలో గురువారం పోలవరం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లు కోల్పోతున్న వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామసభకు వచ్చేవారు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, కరెంటు బిల్లు, ఇంటి పన్ను తేవాలన్నారు. ఇంటి పన్ను తప్పనిసరిగా ఒరిజినల్ అయి ఉండాలన్నారు. ఇంటి యజమాని పాస్‌పోర్టు ఫొటో తీసుకురావాలన్నారు.

ఆసుపత్రికి వెళ్తుంటే.. ఆయువు పోయింది!



సందీప్ మృతదేహం వద్ద పోలీసులు, నాయకులు, సందీప్ (ఫైల్ ఫొటో)

- గోడిలంక వద్ద రోడ్డు ప్రమాదం
- ఐదేళ్ల బాలుడి దుర్మరణం
- తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు

అల్లవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక వద్ద ఆర్అండ్‌బీ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతిచెందగా తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. అల్లవరం మండలం గోడిబాడవకు చెందిన సిర్రా దుర్గాప్రసాద్, శిరీష దంపతులు తమ కుమారుడు సందీప్ (5)కు రెండు రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వారు ముగ్గురు మోటారు సైకిల్‌పై అమలాపురం ఆసుపత్రికి బయలుదేరారు. గోడిలంక శ్మశానవాటిక వద్దకు వచ్చేసరికి ఒక కుక్క వేగంగా అడ్డురావడంతో అదుపు తప్పి మోటారు సైకిల్‌పై నుంచి వారు కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడ్డ వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. బాలుడు సందీప్ తలకు తీవ్ర గాయమై అప్పటికే మృతిచెందినట్టు కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు శిరీష-దుర్గాప్రసాద్‌లు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, తోట నరసింహారావులు ఆసుపత్రిలో సందీప్ మృతదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు గాయపడి వారి కుమారుడు మృతి చెందడం పట్ల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు దూరమయ్యారనే బెంగతో...

అనపర్తిలో యువకుడి ఆత్మహత్య


రవితేజ మృతదేహం

అనపర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మార్కెండేయపురానికి చెందిన మంతిన రవితేజ(26) మంగళవారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రవితేజ తల్లి 2021లో ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత క్రమంలో రవితేజ తండ్రి కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అవివాహితులైన రవితేజ, అతడి సోదరుడు అచ్యుత్‌లు విడివిడిగా నివాసం ఉంటున్నారు. ఇటీవల తల్లి మరణం కేసులో సోదరులిద్దరూ కోర్టుకు సాక్షం చెప్పేందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు దూరమయ్యారనే బెంగతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తాను ఉంటున్న ఇంటిలో రవితేజ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవితేజ సోదరుడు అచ్యుత్ అన్న ఇంటికి వెళ్లి ఎంత కొట్టినా తలుపులు తెరవక పోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం


లభ్యమైన సతీష్ మృతదేహం

అల్లవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడితిప్ప కైలాసభూమి వద్ద వైనతేయ గోదావరిలో వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన అవివాహితుడు లింగోలు వీరవెంకటసత్యనారాయణ (సతీష్)(31) మృతదేహం అల్లవరం మండలం గోడితిప్ప వద్ద వైనతేయ నదిలో మంగళవారం లభ్యమైంది. అమలాపురంలోని జోళ్ల షాపులో పనిచేస్తున్న సతీష్ తల్లి 6నెలల క్రితం మరణించగా ఒంటరిగా ఉంటూ మానసిక ఆందోళనకు గురై జీవితంపై విరక్తితో గోదావరిలో దూకేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. తన మోటారు సైకిల్‌ను గట్టు మీద పెట్టి దూకేశాడని భావిస్తున్నారు. సోమవారం రాత్రి అతడి కోసం వెతికినా జాడ లేదని, గోడితిప్ప రేవులో సతీష్ మృతదేహం మంగళవారం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. మానసిక ఆందోళనతో పాటు ఆర్థిక సమస్యలు కూడా కారణమై ఉంటాయని భావిస్తున్నారు. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. గోడితిప్ప వీఆర్వో సమక్షంలో పంచనామా జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టానికి అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన పొన్నాడ


పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రితో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

యానాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కాంగ్రెస్ నేతలతో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ సమావేశమయ్యారు. యానానికి చెందిన కాపు సంఘ అధ్యక్షుడు కాంటంశెట్టి రామూర్తి, యానాం కాంగ్రెస్ ప్రతినిధి ఆర్ధాని దినేష్‌లతో కలిసి పుదుచ్చేరి వెళ్లిన పొన్నాడ సతీష్ పుదుచ్చేరి కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు, పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే వైద్యనాధన్‌లను మర్యాపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. పలు అంశాలపై చర్చించనట్లు తెలుస్తుంది. ఈ భేటి ప్రస్తుతం ఇటు ముమ్మిడివరం, యానాంలోను రాజకీయంగా తీవ్ర చర్చకు దారీ తీస్తుంది. రానున్న ఎన్నికల్లో యానాం నుంచి గురువు మల్లాడికి, మల్లాడి వర్గానికి వ్యతిరేకంగా పొన్నాడ పోటీ చేస్తారని సోషల్ మీడియాలో వార్త హల్‌చల్ చేస్తుంది.

29న చొల్లంగి తీర్థాన్ని విజయవంతం చేయాలి

కరప, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 29వ తేదీన జరిగే చొల్లంగి అమావాస్య తీర్థాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. కరప మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, ట్రాఫిక్, ఎండోమెంట్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖల అధికారులతో ఏర్పాట్లపై ఆమె సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేర్గాంచిన చొల్లంగి తీర్థానికి వేలాది మంది భక్తులు రానున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాటుచేయాలన్నారు. ఉప్పలంక శివారు మొండిలో బాలత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి, చొల్లంగిలోని సీతారామస్వామి, ఆంజనేయస్వామివార్ల ఆలయాలకు అన్ని రకాల హంగులు కల్పించాలన్నారు. సముద్ర స్నానాలాచారించే స్నానఘట్టాలు, పరిసరాలను శుభ్రంచేయాలన్నారు. భక్తులకు తాగునీటి సదుపాయం, వైద్యఆరోగ్యశిబిరం ఏర్పాటుచేయాలన్నారు. ఆలయ పరిసరాలు, చుట్టుపక్కల పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. అప్పన్నెద్దులను మధ్యాహ్నం నుంచి స్నానఘట్టాల వద్దకు అనుమతించాలని సూచించారు. యానాం జాతీయరహదారిని చేర్చి ఈ తీర్థం జరగనున్న దృష్ట్యా రెండురోజుల ముందు నుంచి ట్రాఫిక్‌ను మరలించాల న్నారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎంఎస్ ఎన్ చారిటీస్ కార్యనిర్వాహణాధికారిణి కె.విజయలక్ష్మి, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎస్ఐ తోట సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వర్ధన్, ఏవో బీఎల్ నరసింహారావు, ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని..

బాలుడిపై బ్లేడుతో తండ్రి దాడి


గాయపడిన బాలుడు

ముమ్మిడివరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె వెంటపడి ప్రేమిస్తున్నానని వేధిస్తున్న బాలుడిపై బాలిక తండ్రి బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో జరిగింది. ముమ్మిడివరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలుడు అదే ఆ పాఠశాలకు ఎదురుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికతో మాట్లాడుతూ వెంటాడడంతో బాలిక తండ్రి పలుసార్లు ఆ బాలుడిని మందలించాడు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మంగళవారం బ్లేడుతో బాలుడిపై పలుచోట్ల దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన బాలుడు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీబీ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడిపై దాడి చేసిన బాలిక తండ్రి పోలీసులకు లొంగిపోగా అతను నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

బాలిక మిస్సింగ్‌పై పోక్సో కేసు నమోదు

కె.గంగవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అపహరణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పామర్రు ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రు గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక ఈనెల 19న ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆచూకీ నేటికి తెలియకపోవడంతో అపహరణగా పోక్సో కేసు నమోదు చేసి రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

19 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మంగళవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, సిబ్బంది 19.265 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేశారు. శంఖవరం మండలం సిద్దువారిపాలెనికి చెందిన తరుం వెంకటేశ్వరరావు ఒక మూటలో గంజాయి తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు.



సత్యదేవుడి సన్నిధిలో... ప్రసాద్‌స్కీం పనులకు మరో ముందడుగు


అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

అన్నవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో గడిచిన తొమ్మిదేళ్లగా ఊరిస్తూ వస్తున్న కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు పడింది. సుమారు రూ.25.32 కోట్లతో అన్నదానభవనం, క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్‌స్టేషన్లకు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అయితే ఎన్నికలు ముగిసి ఆరునెలలు గడిచినా పనులు ప్రారంభంకాలేదు. ఒక పర్యాయం టెండర్లు పిలిచి తరువాత టెండర్లను టూరిజంశాఖ రద్దు చేసింది. తిరిగి ఈనెల 9వతేదీన మరోసారి టెండర్లు పిలవగా 24వతేదీన టెండర్లు తెరవనున్నారు. తెరిచిన నెలరోజుల్లో పనులు ప్రారంభించడం జరుగుతుందని టూరిజం అధికారులు తెలిపారు. ఈమేరకు మంగళవారం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లతో ఆర్కిటెక్చర్స్ టి.బాలకృష్ణ, శ్రీనివాస్, టూరిజం ఏఈఈ వెంకటేష్ చర్చించి అన్నదాన భవనం నిర్మించబోయే టీటీడీ సత్రం స్థలాన్ని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా ప్రసాద్‌స్కీం ద్వారా నిర్మించబోయే అన్నదాన భవనం కోసం ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం అన్నదాన భవనం పూర్తిస్థాయిలో భక్తులకు సరిపోవడం లేదని వారికి వివరించగా నెలరోజుల్లో పనులు ప్రారంభమవుతాయని టూరిజం అధికారులు వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు వి.రామకృష్ణ, నూకరత్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగా అభ్యాసనంతో సహజంగా సుఖశాంతులు

అన్నవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి అనునిత్యం యోగా, జ్ఞానయోగా అభ్యాసం ద్వారా సహజంగా సుఖశాంతులు పొందవచ్చునని ఉషాదీదీ పేర్కొన్నారు. 3రోజులపాటు సత్యదేవుడి సన్నిధిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జరిగే సర్వగుణ సంపన్నత యోగా బట్టిని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, తుని మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతీ వ్యక్తి జీవితంలో సామాజిక, మానసిక ఒత్తిడితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీంతో ప్రతిఒక్కరికి మనశ్శాంతి, సుఖం కావాలని అవన్నీ ఆధ్యాత్మిక భావం, యోగాభ్యాసం ద్వారా సిద్దిస్తాయన్నారు. కార్యక్రమానికి ముంబాయి నుంచి హల్కాదీది, నాలుగుజిల్లాల ఇన్‌చార్జిలు రజనీ, అన్నపూర్ణ, సుమిత్రానంద సరస్వతీతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా బ్రహ్మకుమారీలు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న చైర్మన్ రోహిత్, బ్రహ్మకుమారీలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతమే లక్ష్యం

- ప్రతీ గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరి
- విద్యాశాఖ ప్రాంతీయ సదస్సులో డైరెక్టర్ విజయరామరాజు



సదస్సులో మాట్లాడుతున్న విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, పాల్గొన్న కలెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతుందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని మానవ వనరుల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో రాష్ట్రంలో నూతన విద్యావిధానంపై నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడానికి మానవ వనరుల విభాగంలో భాగస్వామ్యం అయిన మేధావి వర్గంతో అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 6,7,8 విద్యార్థులు ఉన్న చోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి జిల్లా పరిపాలన యంత్రాంగం ప్రమేయం చాలా అవసరమన్నారు. అందుకనుగుణంగా ఆయా సమన్వయ శాఖల అధికారులతో వర్క్‌షాపును ఏర్పాటు చేశామన్నారు. నూతన ప్రతిపాదిత విధానంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, హైస్కూల్‌గా పాఠశాలల ఉన్నతీకరణ చేస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు, ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 25 పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీటిలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారి అభిప్రాయాలను సమీకరించి ఒక సమగ్ర అధ్యయన నివేదిక రూపొందిస్తామని తెలిపారు.

ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాల్య సంరక్షణ, విద్యసజావుగా ఉండేలా ఉమ్మడి అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలతో అనుసంధానించడం గాని లేదా సమీపంలోని అంగన్వాడీ కేంద్రాలను మార్చడం ద్వారా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ కలెక్టర్లు పి.ప్రశాంతి, మహేష్ రావిరాల, ఎస్.షాన్‌మోహన్, కమిషనర్ కేతన్ గార్గ్, పాఠశాల విద్యా ప్రాంతియ సంయుక్త డైరెక్టర్ జి.నాగమణి, ఆర్‌డీవోలు, డిప్యూటీ డీఈవోలు,ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

90శాతం లక్ష్యాలను అధిగమించాం

పోస్టల్‌శాఖ బీమా పథకాలు అత్యంత ప్రయోజనకరం

రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు


రాయవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న శేషారావు

రాయవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి పొందేలా పోస్టల్‌శాఖ నిర్వహిస్తున్న బీమా పథకాలు అత్యంత ప్రయోజనకరమని, ఈ ఏడాది మార్చి మాసాంతానికి రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రూ.50 కోట్ల గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్), పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్ఐ) ప్రీమియం చేయాలన్నది లక్ష్యంకాగా ఇప్పటికే 90శాతం లక్ష్యాలను అధిగమించినట్టు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. మంగళవారం రాయవరం తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రాజమహేంద్రవరం ఈస్టు, వెస్టు, రామచంద్రపురం, రంపచోడవరం, చింతూరుతో 5 డివిజన్లు, 63 సబ్ పోస్టు ఆఫీసులు, 307 బ్రాంచ్ పోస్టు ఆఫీసుల ద్వారా ఆర్‌డీ, టర్మ్ డిపాజిట్లు, ఎంఐఎస్, సీనియర్ సిటిజన్, కిసాన్ వికాస్ పత్రాలు, నేషనల్ సేవింగ్స్ స్కీమ్, సుకన్య సంవృద్ధి తదితర పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఖతాదారులందరికీ మెరుగైన ఆన్‌లైన్ సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 2018లో ప్రధాని మోదీ ప్రారంభించిన ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) ద్వారా ప్రజలకు అన్ని సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా అందా లన్న లక్ష్యంతో ఎన్‌పీసీఐను బ్యాంక్, పోస్టల్ సేవి ంగ్ ఖాతాదారులు ఉన్నవారికి అనుసంధానం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవోల సహకారంతో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 1లక్షా 50 వేల మందికి ఎన్‌పీసీఐ చేయగలిగామన్నారు. పర్సంటేజ్ పరంగా రాజమహేంద్రవరం డివిజన్ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఎన్‌పీసీఐ లింక్ చేసిన ఖాతాదారులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు నేరుగా వారి ఖాతాలకే జమ అవుతాయన్నారు. డివిజన్ పోస్టల్ కార్యాలయంలో పోస్‌పోర్ట్ కేంద్రం ద్వారా రోజూ 70 నుంచి 80 మంది వరకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని, నమోదుకు అవసరమైనపత్రాలతో వచ్చిన వారికి సత్వర సేవలు అందిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో 34 శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు తదితర సేవలు తక్కువ ధరకు అందిస్తున్నట్టు చెప్పారు.

దేవదాయశాఖ డీసీ పర్యటన

కరప, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఉభయగోదావరి జిల్లాల డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు మంగళవారం కరప మండలంలో పర్యటించారు. వేళంగిలో పాతూరి బులివెంకాయమ్మ సత్రాన్ని సందర్శించారు. సత్రం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేసి కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు ఇచ్చినట్టు ఈవో మోర్తా మురళీవీరభద్రరావు డీసీకి తెలిపారు. సత్రం వంశపారంపర్య ధర్మకర్త మెర్ల సరోజామాణిక్యాంబ నూతన భవనానికి కొంతమొత్తం విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చినట్టు వివరించారు. దీంతో సత్రం కోసం భవనం నిర్మించి మిగిలిన ఖాళీస్థలంలో షాపులు నిర్మించేందుకు మూడేళ్ల లీజు కోసం ప్రతిపాదనలు పంపిస్తామని డీసీ వెల్లడించారు. అనంతరం కరప వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఈవో తిరుమల రవితేజ, అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


వేళంగి సత్రాన్ని పరిశీలిస్తున్న డీసీ

అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలి

కుడా చైర్మన్ తుమ్మల బాబు

'శ్రీప్రకాష్‌లో' ఘనంగా ముగిసిన జాతీయస్థాయి స్కూల్ చెస్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న తుమ్మల, అతిథులు

పెద్దాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గత 5 రోజులుగా జరిగిన జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని విజయం సాధించడానికి మరో అవకాశం దక్కినట్టు భావించాలన్నారు. ముఖ్యంగా చెస్ క్రీడ పట్ల యువత ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ మాట్లాడుతూ పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాలలో జాతీయస్థాయి చెస్ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అజిత్‌కుమార్ వర్మ, ఆర్ఎస్ఎస్ రామచంద్రరావు, కాళ్ల జ్వాలాముఖి, చెస్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, పాఠశాల ప్రిన్సిపాల్ యంవీఎస్ఎస్.మూర్తి, పాఠశాల కోఆర్డినేటర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అలరించిన గాత్ర కచేరి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో మంగళవారం మూడోరోజు కార్యక్రమంగా వసుధ రవి, చెన్నై వారి గాత్ర కచేరి అలరించింది. వసంత వర్ధంతో ప్రారంభించి ఆరభి రాగంలో త్యాగరాజస్వామి వారి ఘనరాగ పంచరత్న కీర్తన సాధించెనే ఓ మనసా, అన్నమాచార్యులవారు హిందోళం రాగంలో గరుడగమన తదితర కీర్తనలు గానం చేసి మైమరపించారు. వయోలిన్‌పై చిన్మయి, చెన్నై, మృదంగంపై కె.సద్గురుచరణ్ విజయవాడ సహకారాన్ని అందించారు. జ్యోతుల ఐశ్వర్య జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ ఎస్వీ.రావు, బుర్రా పద్మనాభం, వెన్నపు చక్రధరావు, ఎంవిజి కృష్ణంరాజు, నల్లమిల్లి మణిబాబు, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.



కాకినాడలో గాత్ర కచేరి దృశ్యం

వెంకట్‌కు తెలుగుకీర్తి ప్రతిభాపురస్కారం

అంబాజీపేట,జనవరి21(ఆంధ్రజ్యోతి): కవితల ద్వారా ప్రజల్లో చైతన్య తీసుకువస్తున్న అంబాజీపేటకు చెందిన పొలమూరి వెంకట్‌కు తెలుగుకీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ, శ్రీకళా వేదిక ఆధ్వర్యంలో అవార్డును అందించారు.

చల్లపల్లిలో పశు వైద్య శిబిరం

ఉప్పలగుప్తం,జనవరి21(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం ఏరియాపశువుల ఆసుపత్రి సహాయసంచాలకుడు బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చల్లపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందులిచ్చారు. పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేశారు. జేవీవో కేవీరామారావు, ఏహెచ్ఏలు గొలకోటి గాంధీ పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిల తీరే వేరయా!

- ఒక కుళాయి ఏర్పాటుచేస్తే సరిపోయే చోట నాలుగేసి కుళాయిలు
- ఒకేచోట రెండేసి, మూడేసి కుళాయిల ఏర్పాటు


సాకుర్రు కాపులపాలెంలో ఒకేచోట నాలుగు ఇంటింటికీ కుళాయిలు

అమలాపురంరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. జలజీవన్ మిషన్ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటుచేసే కార్యక్రమం చేపట్టింది. తాగునీటిని సరఫరా చేసే స్థాయిలో ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణాలు చేపట్టకుండా, చేపట్టినవి పూర్తి చేయకుండా లక్ష్య సాధనలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఇంటింటికీ కుళాయిలను మాత్రం మండలంలో ముమ్మరంగా చేపట్టారు. ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో, ఎప్పటికి నిర్మాణాలు చేపడతారో తెలియదు. ఒక్క సాకుర్రు గ్రామంలోనే కాపులపాలెంలో ఒకేచోట ఇంటింటికీ కుళాయిలు పేరిట నాలుగు కుళాయిలను ఏర్పాటుచేసిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అదేగ్రామంలో పలుచోట్ల రెండేసి, మూడేసి కుళాయిలను ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎక్కడికి వెళ్లినా ఇదే పరిస్థితి. ఒక కుళాయి ఏర్పాటుచేస్తే సరిపోయేచోట నాలుగేసి కుళాయిలు ఏర్పాటు చేయడం ఏమిటోమరి. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చినబాబును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పంచాయతీలో ఇంటి పన్నులు చెల్లిస్తున్న కుటుంబాల ఆధారంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఒకే ఇంట్లో నాలుగు కుటుంబాలున్నా ఇంటి పన్ను ఆధారంగానే కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇళ్లవద్ద కాకుండా రోడ్డు పక్కన ఎక్కడో నాలుగేసి కుళాయిలు ఏర్పాటుచేసిన తీరుపై ప్రశ్నించగా ఆయన నీళ్లనమిలారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పాదయాత్ర


గడియార స్తంభం సెంటర్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన

అమలాపురంటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి తప్పించి జాతికి క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర చేపట్టాయి. స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నాలో సీనియర్ నాయకుడు జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జైభీమ్.. జై సంవిధాన్.. జై బాపు నినాదాలతో ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరసనలో ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు అయితాబత్తుల సుభాషిణి, కోట శ్రీనివాసరావు, పాలెపు ధర్మారావు, రౌతు ఈశ్వరరావు, సరెళ్ల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు ముషిణి రామకృష్ణారావు, రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, మహ్మద్ ఆరిఫ్, కుడుపూడి శ్రీనివాస్, వంటెద్దు బాబి, దోనిపాటి విజయలక్ష్మి, మాచవరపు శివన్నారాయణ, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షం


సిరిపల్లి-మాగాం రహదారి

అయినవిల్లి,జనవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రావడంతో రహదారులకు మోక్షం కలిగింది. గత వైసీపీ పాలనలో రహదారులపై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అడుగుకో గుంత ఏర్పడడంతో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. ఆ గుంతల్లో వాహనాలు పడి పాడైపోయేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో విలస-వేమవరం, సిరిపల్లి-మాగాం గ్రామాలకు రహదారులు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

సీఎం సహాయనిధితో ఎందరికో మేలు

మలికిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో పలువురికి మేలు జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో రాజోలు మండలానికి చెందిన ఐదుగురికి రూ.7.57లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. సీఎం సహాయ నిధి ద్వారా రాజోలు నియోజకవర్గంలో ఎంతో మంది పేదలకు వైద్య ఖర్చు లకోసం సహాయం చేశామన్నారు.కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, గుబ్బల రవికిరణ్, దేశినీడి తాతాజీ, పిండి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పి.గన్నవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పది రోజులు గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను పాడిరైతులు వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకిరణ్‌చైతన్య కోరారు. పోతవరం గ్రామసచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఈనెల31 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. టీకాలు, నట్టల నివారణతో పాటు పశువులు, కోళ్లకు సంబంధించి రైతులకు మందులు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. గ్రామసర్పంచ్ వడలి కొండయ్య, వెటర్నరీ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

పాలం పిలుస్తోంది

అంతర్వేది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, అప్పనరామునిలంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రైతులకు ఎన్పీఎస్ఎస్ యాప్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి స్మార్ట్ ఫోన్లతో సూచనలందించారు. పీఎం కిసాన్ లబ్ధి పొందుతున్న రైతులు రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలకు సంక్రమింపచేసే ఎండీఎఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 1,114 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడిలో సన్నకారు రైతుల ఆందోళన


సన్నకారు రైతుల నిరసన

మామిడికుదురు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తమ పంట పొలాలకు చెందిన భూమి ఓఎన్జీసీ కార్యకలాపాలతో నాశనమైపోయిందని పాశర్లపూడికి చెందిన సన్నకారు రైతులు ఆందోళన నిర్వహించారు. 20ఏళ్లక్రితం ఓఎన్జీసీ వారు తమ కార్యకలాపాల కోసం వరిచేల చుట్టూ అడ్డదిడ్డంగా రోడ్లు ఏర్పాటు చేయడంతో 200ఎకరాల పంటభూమి నాశనమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చేల చుట్టూ రోడ్లు నిర్మించడం వల్ల మురుగునీరు కిందకు దిగే పరిస్థితి లేక ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూమి మోడుబారిపోయిందని పేర్కొన్నారు. అమ్ముకుందామన్నా, కట్నం కింద ఇద్దామన్నా తమ భూమి పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమ పొలాల చుట్టూ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అల్లవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం పేదల చెంతకు బ్యాంకింగ్ సేవలు విస్తరింప చేస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అమలాపురం బ్రాంచి మేనేజర్ వి.శ్రీనివాసరావు అన్నారు. బోడసకుర్రు పంచాయతీలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అమలాపురం బ్రాంచి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సభకు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వార్షిక ప్రీమియం రూ.12తో రూ.2లక్షల ఇన్సూరెన్సు భరోసా పొందవచ్చునన్నారు. పీఎం జన్‌ధన్‌యోజన కార్యక్రమాలపై వివరించి ఖాతాలు తెరిపించారు. కార్యక్రమంలో అయిల వెంకటనాగేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముత్యాల బాబి, పొట్టుపోతు దుర్గారావు, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలి'

మామిడికుదురు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీటీడీ ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, కడపకు చెందిన సిద్ధవటం యానాదయ్య కోరారు. మంగళవారం అప్పనపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, అవి మానుకోవాలని కోరారు. అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలోని కల్యాణ కట్టలో పనిచేస్తున్న వారిలో సక్రమంగా విధులకు హాజరుకాని వారిని, వయసు మీరిన వారిని తొలగించి కొత్తగా 24మందిని విధుల్లోకి తీసుకున్నారని, అప్పటి ట్రస్టు బోర్డు, దేవదాయశాఖ అధికారుల నిర్ణయం మేరకు ఈఒప్పందం జరిగిందన్నారు. అందులో తన ప్రమేయం ఏమాత్రం లేదని పేర్కొన్నారు. అనర్హులుగా తొలగించిన 10మందితో తనపై తప్పుడు కేసు నమోదు చేయించారని, ఒక్కొక్కరి నుంచి రూ.50వేలు వసూలుచేసి తనకు ముడుపులుగా చెల్లించినట్టు తప్పుడు ఫిర్యాదుచేసి కేసు నమోదుచేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులు ఎదుర్కోవడం ఏమాత్రం ఇబ్బంది కాదన్నారు. నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఏపీ ఆలయాల కేశఖండనశాల రాష్ట్ర అధ్యక్షుడు గుండుపల్లి రామదాస్, దేవస్థాన కల్యాణకట్ట అధ్యక్షుడు ఆర్ఎస్వీఎస్ ప్రసాద్, కార్యదర్శి పీవీవీ దుర్గారావు పాల్గొన్నారు.

కొబ్బరితోట పునరుద్ధరణ పథకం అమలుపై కమిటీలు


అంబాజీపేట మండలంలో కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అంబాజీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కొబ్బరితోట పునరుద్ధరణ పథకం అమలుపై కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ తెలిపారు. ఈకమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సెరికల్చర్, అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త, కొబ్బరి అభివృద్ధి సంస్థ నుంచి ఓ అధికారి చొప్పున సభ్యులుగా, మెంబర్‌గా మరియు కన్వీనర్‌గా జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ నియమితులయ్యారు. ఈబృందం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించి కొబ్బరి తోట పునరుద్ధరణ పథకం అమలుపై పరిశీలిస్తారన్నారు. కొబ్బరి తోటలను రాండమ్‌గా పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందిస్తారన్నారు. అంబాజీపేట మండలం వాకలగరువు, గంగలకుర్రు, పుల్లేటికుర్రు గ్రామాల్లో, అయినవిల్లి మండలంలో మాగం, క్రాప గ్రామాల్లో, ముమ్మిడివరం మండలంలో లంక ఆఫ్ ఠాణేలంక, అమలాపురం మండలంలో ఇందుపల్లి గ్రామాలను సందర్శించారన్నారు. ఈక్షేత్రస్థాయి పరిశీనలో కమిటీ బృందం కొబ్బరి తోటల పునరుద్ధరణ పథకం అమలుపై పరిశీలించారు. ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ, ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు, జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణి, శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, ఉద్యాన, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రహదారి పటిష్టతకు మట్టి నమూనాల సేకరణ


మట్టి నమూనాలు సేకరిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర

పి.గన్నవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అంబాజీపేట రహదారి రూ.8కోట్లతో అభివృద్ధి చేస్తున్న క్రమంలో పోతవరం వద్ద క్రుంగిన రహదారి పటిష్టత కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర తెలిపారు. పోతవరం వద్ద మట్టి నమూనాల కోసం చేస్తున్న డ్రిల్లింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. రహదారి క్రుంగిపోయిన ప్రాంతంలో పలు చోట్ల మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు కోసం విజయవాడలో ఉన్న ఆర్‌అండ్‌బీ మట్టి పరీక్ష కేంద్రానికి పంపించనున్నట్లు తెలిపారు. పది అడుగులు వరకు ప్రతి పొరకు మట్టిని సేకరిస్తామన్నారు. పరీక్షలను అనుసరించి పర్ఫోరైడ్ వర్టికల్ డ్రైన్స్ పద్ధతి (రహదారి చెంతనే గొట్టాలను భూమి లోకి పంపించి డ్రైన్ ఏర్పాటుచేసే పద్ధతి) లేదా లైమ్ స్టెబిలైజేషన్ (రహదారి చెంతనే మీటరులోతులో మట్టితో సున్నం కలిపి పటిష్టపరు చుట) పద్ధతుల్లో ఒక పద్ధతి ద్వారా రహదారిని పటిష్టతకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

24నుంచి పూర్తిస్థాయిలో బంద్

పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి కోకోనట్ కల్యాణ మండపం వరకు సీసీ రోడ్డు (975 మీటర్లు మేర) నిర్మాణం కోసం ఈనెల 24వ తేదీ నుంచి నెల రోజులు రహదారిని పూర్తిస్థాయిలో మూసివేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి


సాకుర్రులో కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న రాష్ట్ర ప్రత్యేకాధికారి రాధాకృష్ణమూర్తి

అమలాపురం రూరల్, జనవరి21(ఆంధ్రజ్యోతి): పశువులతో పాటు కోళ్లకు సైతం వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా వాటి ఆరోగ్యాన్ని సంరక్షించవచ్చునని పశు ఆరోగ్య శిబిరాల ప్రత్యేకాధికారి, ఉపసంచాలకుడు డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి చెప్పారు. సాకుర్రులో మంగళవారం రాత్రి పశు వైద్యాధికారి డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాల్లో భాగంగా కోళ్లకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ కె.వెంకట్రావుతో పాటు విజయవాడ నుంచి వచ్చిన రాధాకృష్ణమూర్తి శిబిరాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో కోళ్లలో కుక్కర్ తెగులు, మసూచి నివారణకు టీకాలు వేస్తున్నట్టు వివరించారు. జిల్లాలో 8లక్షల దేశవాళీ కోళ్లను రైతులు పెంచుతున్నారని, వాటన్నింటికీ టీకాలు వేస్తున్నామన్నారు. గ్రామంలో దత్తహనుమ గోశాలను సందర్శించి గోశాల నిర్వాహకుడు నాగబాబును అభినందించి చుట్టూ దోమల తెర నిమిత్తంరాధాకృష్ణమూర్తి రూ.5వేలు విరాళం అందజేశారు. పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు పొలమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న గోపాలకృష్ణ

కాకినాడ, రాజోలు జట్లు విజయం

అమలాపురంరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి.తొలుత రాజోలు-రాజమహేంద్రవరం జట్ల మధ్య నిర్వహించిన పోటీల్లో రాజోలు జట్టు విజయం సాధించినట్టు కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఉపద్రష్ట విజయాదిత్య, పెద్దింటి అక్షయ్ తెలిపారు. కాట్రేనికోన-కాకినాడ మధ్య జరిగిన పోటీల్లో కాకినాడ జట్టు విజయం సాధించింది. తాడేపల్లిగూడెం-రాజోలు జట్ల మధ్య జరిగిన పోటీల్లో రాజోలు జట్టు విజయం సాధించింది. విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణమూర్తి, పట్టణ సీఐ పి.వీరబాబు, కర్రా శివయ్య, కర్రా సుబ్రహ్మణ్యశర్మ ఆయాజట్లలో మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు షీల్డులు అందజేశారు.

మేము సైతం.. విశ్రాంత ఉద్యోగుల స్వచ్ఛ భారత్


అమలాపురం బాలయోగి స్టేడియంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అమలాపురం టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వారంతా ఏనాడో ఉద్యోగ విరమణ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో బుధవారం నుంచి కోనసీమ క్రీడోత్సవం పేరిట పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులైన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు స్టేడియంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులైన వీరంతా క్రీడా ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని తొలగించడంతో పాటు పరిశుభ్రత కోసం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. మేము సైతం అంటూ చేపట్టిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పేరి లక్ష్మీనరసింహం, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, గోటేటి గంగాధర్, యర్రమిల్లి సత్యనారాయణ, బాలసుబ్రహ్మణ్యం, భవానీశంకర్‌తో పాటు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్ స్నేహితుడైన విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబాకు నవనీత జలాభిషేకం

మలికిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో వేంచేసి ఉన్న షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి నవనీత (వెన్న) జలాబిషేకం జరిపారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు జంటలుగా బాబా వారి అభిషేకంలో పాల్గొన్నారు. మలికిపురం షిర్డీ సాయి ఆలయ 26వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, జంపన సత్యనారాయణరాజు, పిండి సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీనివాస్, వెంకట్రామరాజు, బొక్కా గోవిందు, గుబ్బల రవికిరణ్, ముదునూరి గంగరాజు పాల్గొన్నారు.

కరకీర ధ్వజం ఆవిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేషా నిలయంలో శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఈనెల28 నుంచి రాజశ్యామల షోడశరాత్రి పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి సలాది సాయిరామ్ తెలిపారు. 28న ప్రారంభమై ఫిబ్రవరి 12వ తేదీ అర్ధరాత్రి 12గంటలకు అఖండ హోమం పూర్ణాహుతితో పూజా మహోత్సవాలు ముగుస్తాయన్నారు. తొమ్మిది రోజుల పాటు రాజశ్యామలాదేవి విశేష అవతారాలతో పూజలు అందుకుంటారని, 16రోజుల పాటు అహోరాత్రులు అఖండ హోమం జరుగుతుందని వ్యవస్థాపకురాలు పి.నాగకనకదుర్గ తెలిపారు. అక్షయపాత్ర సభ్యులు మంగళవారం కరకీర (రామచిలుక) ధ్వజాన్ని ఆవిష్కరించారు. జ్యోతి, మణి, ప్రసాద్, నిహాల్, భైరవ, దొరబాబు, వాసు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాల్వ గండ్ల పనులు

మలికిపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మలికిపురం నీటి సంఘం ఆధ్వర్యంలో గుడిమెళ్లంక అండర్ టన్నల్ వద్ద వేపచెట్టు డ్రెయిన్ పైనుంచి మలికిపురం వైపు వచ్చే పంటకాల్వపై ఉన్న సిమెంటు టన్నల్ శిథిలమైంది. గత సంవత్సర కాలంగా పంట పొలాలకు వెళ్లాల్సిన నీరు వేపచెట్టు డ్రెయిన్‌లో వృథాగా పోతుంది. ఈసమస్యపై రైతులు నీటిసంఘం అధ్యక్షుడు తిరుమల సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చారు. సుబ్బారావు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి టన్నల్‌కు ఇరువైపులా తాత్కాలికంగా సిమెంటు బస్తాలతో రేకులను అమర్చి పంట పొలాలకు నీరందే ఏర్పాట్లను మంగళవారం చేశారు. దీంతో పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందే అవకాశం ఏర్పడింది. వేసవిలో టన్నల్‌కు మరమ్మతులు చేస్తామని సుబ్బారావు తెలిపారు. నీటి సంఘం డైరెక్టర్ రామరాజు, ఇరిగేషన్ ఏఈఈ రమేష్ పాల్గొన్నారు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మలికిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లక్కవరం పశువైద్యాధికారి పి.సూర్యనారాయణరాజు కోరారు. మంగళవారం గుబ్బలపాలెంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ చెల్లుబోయిన శేషారత్నం ప్రారంభించారు. పలువురు రైతులకు చెందిన పశువులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కందికట్ల నిర్మల, పశువైద్య సిబ్బంది లక్ష్మణరావు, సుమంత్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

అంబాజీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కృషిచేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని, వాటి నివారణకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు, కనెక్షన్లు వంటి వాటిపై ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ సబ్‌ఇంజనీర్ కె.మోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, దొంగ నాగేశ్వరరావు, కోట బేబీరాణి, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీలు ముత్తాబత్తుల ప్రశాంత్, వాకపల్లి దొరబాబు, కుసుమ వెంకటేష్‌పాల్గొన్నారు.

బాబులు మృతికి సంతాపం



అమలాపురం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీపళ్ల వెంకట్రావు కోకోనట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పాలకవర్గ సభ్యుడైన విలస గ్రామానికి చెందిన జిత్తుక బాబులు ఆకస్మిక మృతికి సంఘ ప్రతినిధులు మంగళవారం సంతాపం తెలిపారు. సంఘ అధ్యక్షుడు పళ్ల రాజావెంకటసూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బాబులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంఘ అభివృద్ధికి బాబులు చేసిన కృషిని వక్తలు కొనియాడారు.

ముగ్గురు బాలురపై కేసు నమోదు

అమలాపురం టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామానికి చెందిన యువకుడు గంటి కిరణ్‌పై దాడిచేసిన ఘటనలో అమలాపురం నారాయణపేటకు చెందిన ముగ్గురు బాలురపై మంగళవారం కేసు దర్యాప్తు చేపట్టినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

కూటమి కృషితో స్టీలుప్లాంటుకు ఆర్థిక ప్రోత్సాహం

మామిడికుదురు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి వల్లే వైజాగ్ స్టీలుప్లాంటుకు కేంద్ర ప్రభుత్వంఆర్థిక ప్రోత్సాహం చేసిందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం మగటపల్లిలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల కృషి వల్లే వైజాగ్‌స్టీలు ప్లాంటుకు రూ.11,441కోట్లు కేంద్రం అందించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించడం ఖాయమని ఆకాంక్షించారు. రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి సంసాని పెద్దిరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు కుంపట్ల బాబ్జి, బొలిశెట్టి మాధవ, యాలంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా విరాళాలు రూ.కోటితో శివాలయం నిర్మాణం

మామిడికుదురు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా విరాళాలు రూ.కోటి వ్యయంతో బి.దొడ్డవరం గ్రామంలో శిథిలస్థితికి చేరిన శ్రీఉమాసోమేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. శిథిల ఆలయాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే నూతన ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈనెల29 నుంచి ఫిబ్రవరి 2వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

మామిడికుదురు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం మండలస్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం సీడీపీవో వై.విజయశ్రీ అధ్యక్షతన జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, సీహెచ్‌వో సత్యవతి, ఝాన్సీరాణి, ఉమాలక్ష్మి పాల్గొన్నారు.

రేపు రాజోలు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రాజోలు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ ఎస్ఎస్‌డీసీ వారి ఆధ్వర్యంలో స్కిల్ హబ్ వద్ద 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధికారి డి.హరిశేషు మంగళవారం తెలిపారు. ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సాయిబాబు తెలిపారు. ఈజాబ్‌మేళాలో నాలుగు కంపెనీల్లో వందకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునన్నారు. రూ.10వేల నుంచి రూ.25వేలకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, పదో తరగతి నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సులు, ఫొటోలతో స్కిల్‌హబ్ వద్ద ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు దేవి సెల్ 9603940274, రాజేంద్ర సెల్ 8247645389 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

దేవగుప్తంలో తాటాకిల్లు దగ్ధం

అల్లవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం పంచాయతీ పరిధిలో ఇందిరమ్మకాలనీ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. బుంగ చిట్టిబాబుకు చెందిన తాటాకింట్లో పొయ్యిపై నీళ్లు కాస్తుండగా అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నికీలలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో మంటలను అదుపుచేయడం ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. రూ.2లక్షల ఆస్తి నష్టం ఏర్పడింది. గృహం కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పశువైద్య శిబిరాలు ప్రారంభం

అంతర్వేది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంక గ్రామంలో సర్పంచ్ యిందుకూరి సుబ్బరాజు పశువైద్య శిబిరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్య శిబిరాలతో పశు పోషకులకు మేలు, పశువులకు వచ్చే వ్యాధులను నివారించేందుకు ఈశిబిరాల ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బర్రే శ్రీను, గుబ్బల సూర్యనారాయణ, పశుసంవర్ధక సహాయ సంచాలకుడు ఎస్.వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి కె.సునీల్‌గాంధీ, రవితేజ, సతీష్, రామదాసు, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

ముమ్మిడివరం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన ఏర్పరుచుకోవాలని జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పాటించాల్సిన నియమాలు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్‌ను ధరించిన వ్యక్తి గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారుడితో సమానమని జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వాహనం నడిపే ప్రతీఒక్కరూ హెల్మెట్ ధరించాలని, హెల్మెట్‌ను ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం రహదారి భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అమలాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఏకాగ్రతతో చదవాలి

అంబాజీపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని సాధించేందుకు పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని బీవీసీ అక్షరా ఐఐటీ స్కూల్ జూనియర్ కాలేజీ అధ్యాపకులు యక్కల దేవర సురేష్‌కుమార్ అన్నారు. తొండవరం జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పీవీ కేశవాచార్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగుతులను మంగళవారం నిర్వహించారు. 100 మార్కులు సాధించే విధంగా ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదవాలనారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మట్టపర్తి రాంబాబు, మానుకొండ చంద్రరావు, ఆదుర్తి వెంకట అప్పారావు, పిల్లి త్రిమూర్తులు, పాటి వెంకటేశ్వరరావు, పినిపే సత్యనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గానాల రామమూర్తి జయంతి

అమలాపురంటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రావుసాహెబ్ గానాల రామమూర్తి 134వజయంతిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో రామమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కోసూరి చిదంబరాచారి, సహాయ కార్యదర్శి బొల్లోజు మణిశ్రీకాంత్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలాచార్యులు, జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్యాయిదాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు, సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో చేబోలు గంగానాగేశ్వరరావు పాల్గొన్నారు.

రావులపాలెం ఎస్ఐగా రాము



రావులపాలెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రాము బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు మారేడుమిల్లి స్టేషన్‌లో పనిచేసి అక్కడి నుంచి బదిలీపై వచ్చి మంగళవారం విధులలో చేరారు.

చంద్రబాబు చొరవతో విశాఖ ఉక్కుకు ఊపిరి

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు చొరవతో విశాఖ స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారిలు పేర్కొన్నారు. మంగళవారం వాడపాలెం, కొత్తపేటలో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి ప్రధాని మోదీని ఒప్పించి రూ.11,440 కోట్లు సాయాన్ని సాధించారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. గత వైసీపీ జగన్ ప్రభుత్వం విశాఖ ఉక్కుపై నీలినీడలు కమ్మేలా చేసిందని కర్మాగారాన్ని నాశనంచేసి భూములను దోచుకునేందుకు కుట్ర చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు సిద్ధంశెట్టి సత్యనారాయణ, గుబ్బల వెంకటరమణ, కముజు శ్రీను, చిలకలపూడి సుబ్రహ్మణ్యంపాల్గొన్నారు.



వాడపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

జగన్ విశాఖ ఉక్కును ముంచేశాడు

● అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల



మండపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖ ఉక్కు కర్మాగారంను పరిరక్షించే చర్యలు ఏనాడు తీసుకోలేని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. విశాఖఉక్కు వైసీపీ ప్రభుత్వంలో భ్రస్టు పట్టిందన్నారు. అధికారం ఉన్నా విశాఖ ఉక్కు గురించి జగన్ మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ విక్రయించాలని చూస్తే కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా విశాఖ ఉక్కుకు కేంద్రం నుంచి రూ.11,440 కోట్లను ఆర్థిక ప్యాకేజీ సాధించి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడిన ఘనత వారికే దక్కుతుందన్నారు. విశాఖ ఉక్కు నష్టాల భారి నుంచి బయట పడి లాభాలబాట పట్టేలా చంద్రబాబు గతంలో కృషిచేసిన విషయంను వేగుళ్ల గుర్తుచేశారు. ముఖ్యమంత్రి, చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐ.టి మంత్రి లోకేష్‌తో పాటు ఆర్థిక ప్యాకేజీ అందించిన కేంద్ర ప్రభుత్వంకు వేగుళ్ల ధన్యవాదాలు తెలిపారు.

పశుగణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పశువైద్య శిబిరాల రాష్ట్ర ప్రత్యేకాధికారి రాధాకృష్ణమూర్తి

పినపళ్లలో పశువైద్య శిబిరం ప్రారంభం

అలమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశుగణాభివృద్ధి చేసి పశువులకు మెరగైన వైద్య సేవలు అందించి వాటి ద్వారా రైతులకు అదనపు ఆదాయం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పశువైద్య శిబిరాల పరిశీలన ప్రత్యేకాధికారి కె.రాధాకృష్ణమూర్తి అన్నారు. డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం పినపళ్లలో మంగళవారం పశువైద్య శిబిరం ప్రారంభించారు. ఈనెల 21 నుంచి 30 వరకు గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్యసాయం అందించే చర్యలు చేపట్టినట్లు రాధాకృష్ణ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ గ్రామంలోను వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసాయంతో పాటు మందులు పంపిణీ చేస్తామని వివరించారు. ఈసందర్భంగా రైతులతో పలు విషయాలను చర్చించారు. అనంతరం రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు, సర్పంచ్ సంగీత సుభాష్, ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత, పినపళ్ల, గుమ్మిలేరు వైద్యాధికారులు ఈదల శ్రీనివాస్, సుభాష్ పాల్గొన్నారు.



ఆలమూరు: పినపళ్లలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి రాధాకృష్ణమూర్తి

పశుసంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కపిలేశ్వరపురం: పశుసంరక్షణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పశు వైద్య శిబిరాల రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ కె.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరులో ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పశువైద్యశిబిరాన్ని మంగళవారం గ్రామసర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ రాంబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో పాల్గొన్న రాష్ట్రప్రత్యేకాధికారి డాక్టర్ కె.రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈనెల 20 నుంచి 30 వరకూ పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భకోశవ్యాధుల చికిత్సలు, మందులు, కోళ్లకు టీకాలు వేయనున్నట్లు ఆయన వివరించారు. 71 గేదెలు, 13 ఆవులు, 20 గొర్రెలు, 100 కోళ్ళకు వైద్యం చేశారు. కార్యక్రమంలో అంగర పశువైద్యాధికారి డా.వీవీ రమణమూర్తి, మాచర పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ మాధురి, పశువైద్యసహాయకులు పాల్గొన్నారు.

పిఎం పశుకిసాన్ కార్డులతో ఉపయోగాలు

ద్రాక్షారామ: ప్రధానమంత్రి పశుకిసాన్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పశుఆరోగ్య శిబిరం ప్రత్యేకాధికారి డాక్టర్ కె.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం ఓదూరులో లేగదూడల ప్రదర్శన పశు ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసాల ప్రాముఖ్యం, పశుఆరోగ్యశిబిరాలు లక్ష్యాలను వివరించారు. శిబిరంలో 32 మంది పాడి రైతులకు చెందిన 38 మంది లేగదూడలు ప్రదర్శించారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆర్థిక సహకారంతోరాష్ట్రీయ గోకుల్‌మిషన్ వారి సౌజన్యంతో రూ.20 వేల విలువైన డీవార్మింగ్, కాలుష్యం మాత్రలు, పాల రైతులకు పాలకేనులు బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా.కె.వెంకట్రావు, రామచంద్రపురం పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఓ.రామకృష్ణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.కృష్ణార్జున, పశువైద్యులు సంయుక్త, జి.సురేష్‌బాబు, విజయదుర్గ, బావనజ్యోతి, పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టరు కె.కె. కల్యాణి, తోట నవీన్, టీడీపీ నాయకులు చిగురుపాటి సాయిరాం, పశువైద్య సహాయకులు, గోపాలమిత్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యాభివృద్ధికి వైద్య శిబిరాలు

కె.గంగవరం: పశువుల ఆరోగ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పశుఆరోగ్యవైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందని పామర్రు పశువైద్యాధి కారిణి ఎం.బిందు అన్నారు. మంగళవారం పామర్రులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. పశువులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పామర్రు పశువైద్య సిబ్బంది వైద్యసేవలు అందించా రు. కూటమి నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

వైభవంగా పోలమ్మ తీర్థం



రాయవరం పోలమ్మ వారిని దర్శించుకుంటున్న కుమారబాబు

రాయవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు పోలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలమ్మ అమ్మవార్ని దర్శిస్తే పాడిపంటలు, ఆయుఆరోగ్యాలు, సఖల శుభాలు కలుగుతాయనే నమ్మకంతో ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించి మొక్కులు సమర్పించుకున్నారు. తొలుతగా అమ్మవారి మూలవిరాట్‌కు వెండికవచం అలంకరణ జరిపి ప్రత్యేకపూజలు హారతులు ఇచ్చారు. తీర్థం సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుత్‌దీపాలంకరణ, బాణాసంచా, వివిధ రకాల గరగనృత్యాలు, కొయ్యబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పోలమ్మ అమ్మవారిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మె ల్యే వేగుళ్ల అల్లుడు వంక సాయికుమారబాబు దర్శించుకున్నారు. టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కుమారబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో నేతలకు ఘనంగా స్వాగతం పలికారు.

పోస్టాఫీసులో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాయవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాయవరం పోస్టాఫీసును మంగళవారం తపాలాశాఖ రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తనిఖీ చేశారు. రాయవరం పోస్టాఫీసు ఆఫీసు పరిధిలో ఉన్న లొల్ల, మహేంద్రవాడ, కొప్పవరం, కొమరిపాలెం, వి.సావరం ఉప తపాలా కార్యాలయాల్లో ఖాతాదారుల సంఖ్య ఏవిధంగా ఉంది, ఆధార్ నవీకరణ తదితర అంశాలను బ్రాంచ్ పోస్టు మాస్టర్ సీహెచ్ రవిప్రకాష్‌ను ఆరాతీశారు. ఈసందర్భంగా రికార్డును తనిఖీ చేసి ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు సురేష్, ఫణికుమార్, వినాయక్ పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన శ్రీనివాస్ కాలనీ వివాదం

● ఫలించిన ఎంపీడీవో చర్చలు
● ఇరవై రోజులుగా శ్రీనివాస్ కాలనీవాసులు ఇబ్బందులు



ఆలమూరులో ఇరువర్గాలతో చర్చిస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడులంక శ్రీనివాస్ కాలనీకి వెళ్లే రహదారిపై జరుగుతున్న వివాదంతో గత ఇరవైరోజులుగా ఆకాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి ఇరువర్గాలతో ఎంపీడీవో ఎ.రాజు జరిపిన చర్చలు ఫలించాయి. కాలనీకిఉన్న రోడ్డు తమదని రైతు తవ్వేయడంతో వివాదం మొదలైంది. దీంతో అధికారులకు, నాయకులకు ఫిర్యాదులు చేశారు.ఈకాలనీలో సుమారు 50కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈకాలనీకి ఇది ఒకటే రోడ్డు గత మూడున్నర దశబ్దాలుగా ఉన్న రోడ్డు మార్గాన్ని అక్కడ రైతుఉలు తవ్వేయడంతో సోమవారం తహశీల్దార్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. లారీ తిరిగే ఈరోడ్డుపై ప్రస్తుతం నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారింది. గ్రామపంచాయతీ వేసిన గ్రావెల్‌రోడ్డును తవ్వేయడంపై ఆకాలనీ వాసులు మండిపడుతున్నారు. మాకు రాకపోకలకు ఇబ్బందుగా మారిందని అందువలన సమస్యను పరిష్కరించి మాకు రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ కాలనీ వాసులు వేడుకున్నారు. దీంతో ఎంపీడీవో ఎ.రాజు స్వయంగా సోమవారం వెళ్లి పరిశీలించి ఇరువర్గాలతో చర్చించారు. అయితే బత్తుల పెదకాపు అనే రైతు వాదనను ఎంపీడీవో రాజుకు వివరించారు. తాన పొలంలోనికి పంచాయతీ రోడ్డుకు నేరుగా వెళ్లే మార్గం ఉందని అయితే తన భూమి కోసం తాను ఇచ్చిన భూమిని తీసుకోవడం జరిగిందని కాలనీలోనికి వెళ్లడానికి కాలిబాట ఉందని రైతు పెదకాపు వివరించారు. దీంతో ఇరువర్గాలను పిలిచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాత్రి పెద్దల సమక్షంలో ఎంపీడీవో రాజు జరిపిన చర్చలు ఫలించాయి.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ పెద్దఎత్తున నిధులు కేటాయిస్తుందని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుమిల్లి, వాకతిప్ప, నాగులచెరువు, అంగర గ్రామాల్లో ఆయన సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం నుంచి సెకండ్ ఫేజ్‌లో మండలానికి రూ.కోటి70లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అంగరలో ఆయన సాధారణ మహిళతో సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేయించి అక్కడ ఉన్న అందరినీ ఆశ్చర్య చకితులను చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామసర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అంగరలో సాధారణ మహిళచే సీసీ రోడ్డుకు భూమిపూజ చేయిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

ఆత్రేయపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్కెడిమిల్లికి చెందిన శివంగుల గణేష్, తోరాటి వీరబాబు, కైరం గణేష్, కోటిపల్లి నాగు, కోపెల్ల ప్రసాద్, సాయి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రి నుంచి వారు ఇంటికి చేరుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే బండారు తనయుడు సంజీవ్ బాధితులను పరామర్శించి ప్రమాదానికి సంబంధించిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మాజీ సర్పంచ్ మద్దింశెట్టి వీవీ సత్యనారాయణ, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుతు తూము గణేష్ ఉన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు సెంటర్లు

ఆలమూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదుకు అవకాశం కల్పిస్తూ ఈనెల 22 నుంచి ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న బాలలకు ఆధార్ నమోదుపై అంగన్‌వాడీ సిబ్బందికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎంపీడీవో రాజు పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు విధిగా ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. ఈనెల 22న ఆలమూరు, 23న చెముడులంక, బడుగువానిలంక, 24న నర్సిపూడి, నవాబుపేట, 25న జొన్నాడ, మూలస్థానం, 27న చొప్పెల్ల, 29న చింతలూరు, పెదపళ్ల, 29న పెనికేరు, కలవచర్ల, 30న పినపళ్ల, సంధిపూడి, 31నన మడికి, గుమ్మిలేరు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బాల ఆధార్ క్యాంపులు జరుగుతాయని సూపర్‌వైజర్ నాగలక్ష్మి వివరించారు.

కిశోర బాలిక వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పట్టణస్థాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరబాలిక వికాసంపై అవగాహన సదస్సును నిర్వహించారు. పట్టణానికి సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి కిశోర్ బాలిక వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం నాణ్యమైన విద్య వ్యక్తిగత శుభ్రత, లైంగిక వేధింపులు బాల్యవివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యవృద్ధి, ఉపాధి, పోక్సోచట్టం, సెల్ఫ్ డిఫెన్స్ వంటి అంశాలపై శిక్షణను అందించారు. అలాగే పాఠశాలలు, హైస్కూల్, కళాశాలల్లో చదువుకునే విద్యార్థినులకు బాలిక కిశోరపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని సీడీపీవో గజలక్ష్మి చెప్పారు. మున్సిపాల్టీలో జరిగిన కార్యక్రమానికి గజలక్ష్మి అధ్యక్షత వహించగా మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐసీడీఎస్ ద్వారా అందించే సేవలు గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎన్‌జీవో కోఆర్డినేటర్ నాగేశ్వరి, జూనియర్ కాలేజ్ లెక్చరర్ మంగాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ

మండపేట పట్టణంలో నిరంతరం శానిటేషన్‌పై పర్యవేక్షణ ఉంటుందని అందుకు ప్రజలు వ్యాపారులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మండపేట మున్సిపల్ కమీషనర్ టీ.వి. రంగారావు పిలుపునిచ్చారు. మండపేట పట్టణంలో మంగళవారం ఆయన మున్సిపల్ శానిటరీ, సచివాలయ సిబ్బందితో కలిసి పట్టణంలో పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజారత్నసెంటరు వద్దవున్న చాందినీ హోటల్ నిర్వాహకులు రోడ్డుపై చెత్తవేయడంతో వారికి రూ.200 జరిమానాను ఆయన విధించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు సచివాలయ ఉద్యోగులు శానిటరీ సిబ్బంది ఉన్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మండపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాపేశ్వరం శ్రీచైతన్య విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ రెండోదశ పోటీ పరీక్షల్లో సత్తాచాటారని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. 11మంది విద్యార్థులు నగదు బహుమతులు, 110 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందారన్నారు. ఏజీఎం సురేష్, డీన్.రాఘవరెడ్డి, సి.బ్యాచ్ ఇన్‌చార్జి మల్లిఖార్జున ఉన్నారు.




ఒలింపియాడ్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

నిఘా నీడలో కొత్తపేట

● వ్యాపార సంస్థల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ సూచనలతో కొత్తపేట ప్రధాన రహదారులను ఆనుకుని వ్యాపార కార్యకలపాలు నిర్వహిస్తున్న సంస్థలు ఆయా ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతో కొత్తపేట నిఘా నీడలో నిండి ఉంది. ఇటీవల వ్యాపార సంస్థల్లో చోరీలు, మోటార్‌సైకిళ్ల దొంగతనాలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వాస్తవాలు తెలియక నేరపరిశోధన కష్టమవుతుంది. దీంతో పోలీసులు ముఖ్యకూడలలో వ్యాపార సంస్థలు నడుపుతున్న యజమానులతో సమావేశమై సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతను వివరించి అవగాహన కల్పించారు. దీనికి వారు సుముఖత వ్యక్తం చేయడంతో ఇప్పటికే 12 ప్ర ధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తిచేశారు. మరిన్నిచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు పలువురు ముందుకు రావడంతో భవిష్యత్‌లో నేరపరిశోధన సులభతరం కానుంది. ఇదే విషయమై ప్రధాన వీధుల్లో సైతం సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు ప్రజల భాగస్వామ్యంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మండల మొత్తంలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిస్తారు. నిఘానీడలో కొత్తపేట ఉండటంతో చోరీ భయం తగ్గుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తపేట మారుతీ సెంటర్ మున్నా చర్చివద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ప్రజాసమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేయాలి

ఆలమూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు సమీక్షించి వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా కృషిచేయాలని ఆయన అన్నారు. మండలంలో 48మినీ గోకుళాలు మంజూరుకాగా వీటిలో సగం పూర్తి చేస్తామని దశవారీగా రైతులకు వాటికి సంబంధించిన మొత్తాలు జమచే స్తామని ఎంపీడీవో ఎ.రాజు చెప్పారు. రైతులకు చెల్లింపులు చేయడంలో ఎటువంటి రాజకీయ వత్తిళ్లు లేవని వివరించారు. దాళ్వా వరి సాగులో ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టామని దీంతో రైతులకు ఎటువంటి ఇబ్బందు లు ఉండవని ఏవో లక్ష్మీలావణ్య చెప్పారు. సాగునీటి కాలువలు బాగు చేయడానికి పం చాయతీల డ్రైన్ వాటర్ వచ్చేయడంతో కాలువలు తవ్వకాలకు ఇబ్బందిగా మారిందని కాలువగట్లుపై ఆక్రమణలు ఉండటంవల్ల మారింత ఇబ్బందిగా మారిందని చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ అ న్నారు. అనంతరం పలు శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులను సత్కరించారు. సమావేశంలో తహశీల్దార్ కెజె ప్రకాష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కుష్ఠు రహిత దేశ నిర్మాణానికి సహకరించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని జిల్లా డిప్యూటీ పేరా మెడికల్ అధికారి డాక్టర్ మాధవరపు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం దేశవ్యాప్తంగా జరుగుతున్న లెప్రసీ డిటెక్షన్ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురంలో లెప్రసీ డిటెక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భం గా మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు లెప్రసీ నిర్మూలన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చేనెల 2వరకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈసర్వేలో ఒంటిమీద ఏవిధమైన మచ్చలు ఉన్నా ఆరోగ్యసిబ్బందికి చూపించి అవసరమైన మందు లు వాడాలని వెంకటేశ్వర్లు కోరారు. కుష్ఠు రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ సుధీర్, నోడల్ పర్సన్ చిక్కాల సూర్యారావు, హెచ్ఎస్ బేబీరాణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



లెప్రసీ వ్యాధినిర్మూలన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమీషనర్ అయ్యప్పనాయుడు

గ్రామాల్లో జాతర్లకు అనుమతులు తప్పనిసరి

కొత్తపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో గ్రామాల్లో జరిగే పండుగ జాతర్లకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. జాతర్ల పేరుతో అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకోవడంతోపాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముందుగా పోలీస్ స్టేషన్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. ఇటీవల నిర్వహించిన సంక్రాంతి ప్రభల ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ఉత్సవ కమిటీలకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పండుగలను ఆనందంగా జరుపుకోవాలని అసాంఘిక కార్యక్రమాలతో కాదని స్పష్టం చేశారు. కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్ఐలు

గానాల రామ్మూర్తి జయంతి

మండపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో మంగళవారం, గానాల రామ్మూర్తి జయంతిని జరుపుకున్నారు. స్థానిక కామాక్షి ఏకాంబరేశ్వరి స్వామిహాల్‌లో రామ్మూర్తి చిత్రపటానికి సంఘీయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మూర్తి విశ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి కులానికి మంచి గుర్తింపును తీసుకు వచ్చిన మహనీయుడని సంఘ నాయకులు అన్నారు. విశ్వబ్రాహ్మణసంఘ నాయకులు వీరమల్లు శ్రీనివాస్, గోడి సుబ్రహ్మణ్యం, వేములశ్రీరామ్ శ్రీనివాస్. దార్లస్వా మి, కోటిపల్లి కృష్ణమాచార్యులు, కూమారస్వామి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.84లక్షలు

ఆత్రేయపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,84,933 లభించినట్లు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి21(ఆంధ్రజ్యోతి): మండపేట సబ్‌డివిజనల్ కార్యాలయంలోఈనెల 23న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాల సమస్యలతోపాటు వివిధ రకాల ఇబ్బందులు పరిష్కారానికి ఏపీఈపీడీసీఎల్, సీజీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బిసత్యనాం ాయణ, సాంకేతిక సభ్యులు మసిలమణి, ఎస్.మురళీకృష్ణ హాజరవుతారని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమ్మించి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

ఆత్రేయపురం, జనవరి21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమించి మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం కొంతమూరుకు చెందిన యలమంచిలి పూర్ణరేఖ, బొమ్మూరు రైట్ కాలేజీలో డిప్లొమో చేస్తుండగా అదే కాలేజీలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన చీలి సురేష్ కుమార్ పూర్ణరేఖల మధ్య ప్రేమయాణం సాగింది. అంతేకాకుండా పూర్ణరేఖతో సురేష్‌కుమార్ శారీరక అవసరాలను తీర్చుకున్నాడు. పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి నిరాకరించాడు. దీనిపై ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొబిషన్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆదేశాల మేరకు మండల పరిధి శీలంవారిపాలెం బాబానగర్‌లో దాడులు నిర్వహించి బెల్లం ఊట స్థావరాలను గుర్తించారు. ఈ సందర్భంగా 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్ కుర్చీలు బహూకరణ

కపిలేశ్వరపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర ఉన్నత పాఠశాలకు దాతలు మంగళవారం స్టీల్‌కుర్చీలను బహూకరించారు. గ్రామానికి చెందిన ప్రొఫెసర్ గొడవర్తి భగవన్నారాయణ తన తల్లి గొడవర్తి పర్వతవర్ధనమ్మ జ్ఞాపకార్థం సుమారు రూ.18వేలతో రెండుసెట్లు కుర్చీలను అందజేసినట్లు హెచ్ఎం రమాదేవి తెలిపారు.